కథ

# తేడా

వాలి హిరణ్మయీదేవి

**స్టాఫ్ మీటింగ్‌లో, ఇదివరకు స్టాఫ్‌మెంబర్స్ చేసిన పనులలోని తప్పుఒప్పులను గురించి వివరించి-కొన్ని సవరణలుంటే సూచించి-ఆ తర్వాత వారు మున్ముందు చేయాల్సిన పనుల గురించి ఎక్స్‌ప్లెయిన్ చేసి-ఎవరెవరికి ఏయే పనులు కేటాయించిందో, పి.ఎ.తో నోట్ చేయించి, తన చాంబర్‌లోకి వెళ్ళి కూర్చుంది మృదుల.**

''ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే తరచూ ఇలాగే అనారోగ్యాలపాలు అవుతావు. నీ బాధ్యతలన్నీ తొందరగా కంప్లీట్ అవడంతో-జీవితమంటే బోర్ కొడుతోందన్న దశకి వచ్చావు. ఇన్నాళ్ళూ బిజీగా ఉండబట్టి ఇప్పుడు దొరికిన ఈ ఖాళీ సమయం నీకు డైజెస్ట్ కావడం లేదు. కాబట్టి ఇప్పుడు జాబ్‌లో చేరు. నువ్వూ బిజీ అవుతావు. మా ఫ్రెండ్‌కి సాయం చేసినదానివీ అవుతావు. ముఖ్యంగా నీకెప్పట్నుండో జాబ్ చేయాలని ఉన్న సరదా ఇప్పుడు తీర్చుకున్న దానివవుతావు'' అంటూ భర్త రాజారావ్ చెప్పిన సలహా ప్రకారం, జాబ్‌లో చేరింది- పి.ఆర్.వో పోస్టులాంటిదే కావడంతో బాస్‌కీ-స్టాఫ్‌కీ మధ్య వారధిలా ఉండటమే ఆమె విధి. స్టాఫ్‌తో, బాస్‌తో ఎవరెవర్తో ఎలా బిహేవ్ చేయాలో భర్త ద్వారా తెలుసుకోవడంతో చాలా ఈజీగా నెట్టుకొస్తోంది. ఇరువైపుల వారినీ సాటిస్‌ఫై చేస్తూ రెండేళ్ళుగా అలవోకగా సాగిపోతున్న ఈ కార్యక్రమం-కొత్తగా బాస్‌గా వచ్చిన 'కమల్' రాకతో కొంత డిస్టర్బ్ అయింది మృదులకు. కంపెనీ ప్రొప్రయిటర్ గోపాలకృష్ణ యుఎస్ వెడుతూ- కమల్‌కి ఆథరైజేషన్స్ అన్నీ ఇచ్చి వెళ్ళాడు. కమల్ అతని బావమరిది. కమల్ కూడా డైనమిక్ పర్సన్- అంతేగాక చాలా హాండ్‌సమ్‌గా ఉంటాడు. అతనికీ కంపెనీ కొత్తకావడం వల్ల ప్రతీ విషయాన్ని మృదులతో చర్చించడం ద్వారా వారిద్దరూ గడిపే సమయం ఎక్కువయింది. మృదులంటే అతనికి గౌరవం. ఆమె అందాన్ని పనినీ మెచ్చుకోవడం అతను మామూలుకన్నా కాస్త ఎక్కువగా చేస్తున్నట్లు మృదుల అనుమానం.

అతని ప్లీజింగ్ పర్సనాలిటీ ఆమెలో తెలీని సంచలనం కల్గించిన మాట వాస్తవం. ఆమె ప్రశాంత మానస సరోవరంలో అతని రాక అలజడులను రేపింది. అందుకే జాబ్‌ని కొనసాగించడమా-మానడమా అన్న డైలమాలో పడింది మృదుల.

ఇంతలో ఇంటర్‌కమ్‌లో-

''మిసెస్ మృదులా ఒకసారి నా చాంబర్‌కి రాగలరా'' అన్న కమల్ స్వరం వింటూ ఆలోచనల్లోంచి తేరుకొని అతని ఛాంబర్‌లోకి వెళ్ళిందామె. ఎందుకో ఈమధ్య అలా వెళ్ళిన ప్రతీసారీ తెలీని కలవరం- ఇదివరకెన్నడూ లేని జంకు-తనకామాత్రం నిగ్రహాశక్తి ఆత్మస్థైర్యం లేవా అని తనని తాను మానసికంగా కూడదీసుకుని వెళ్ళి కూర్చుంది. ఆమెనే తదేకంగా చూసిన కమల్ ''ఏంటో కాస్త నెర్వస్‌గా ఉన్నారు. ఒంట్లో బాగోలేదా'' అనడిగాడు.

''అబ్బే-బాగానే ఉంది, దేనికి పిలిచారు'' అంది.

''ఈ లేత నీలిరంగు చీరలో సాగరకన్యలా ఉన్నారు-మీకు చక్కటి డ్రెస్ సెన్స్ ఉంది'' అన్నాడతను.

ఇది చెప్పటానికా పిలిచాడని మనసులో చికాకు పడుతూ పైకిమాత్రం ''థాంక్స్-ఇంతకీ ఏం పని?'' సూటిగా అడిగింది.

''ఏమీలేదు. ఈసారి బాగానే బెనిఫిట్స్ వచ్చాయి. బోనస్‌ని పెంచే విషయమై మీతో సంప్రదిద్దామని'' అతను ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగాడు. ఆమె, అతని వంక చూసి చప్పున కళ్ళు దించి ''ఓసారి మీ బావగారితో మాట్లాడితే బావుంటుంది కదా'' అంది - వచ్చిన లాభాలను వర్కర్లకు పంచాలన్న అతని నిర్ణయానికి సంతోషిస్తూ.

''ఆ మాట్లాడ్డమైంది. డెసిషన్ మనిద్దరికే వదిలాడాయన'' అంటూ నవ్వాడు. నవ్వితే అతని అందం మరింత విజృంభిస్తుంది అని అనుకోకుండా ఉండలేకపోయింది మృదుల. అతని ముందు కూర్చుంటే తన మనసు వివశమవడం, ఆమెకే స్పష్టంగా తెలుస్తోంది. తనేం టీనేజ్ అమ్మాయి కాదు. కనీసం ముప్పై ఏళ్ళ ప్రౌఢ కాదు. ఈ నలభై ఐదేళ్ళ వయసులో- తన మనసెందుకిలా 'పర'వశమవుతూందో తెలీక సతమతమవుతోంది. కట్టుబాట్లు-సంప్రదాయాల గిరి దాటలేక - ఓ విధమయిన త్రిశంకుస్వర్గంలో ఊగిసలాడుతోన్న మనసుతో-చిత్రమయిన చిత్రవధకు లోనవుతోంది.

''హలో- ఏమాలోచిస్తున్నారు? మీరెవరిని సజెస్ట్ చేస్తే వాళ్ళకి మీరు చెప్పిన ఇంక్రిమెంట్ ఏర్పాటు చేస్తాను. మన అకౌంటెంట్- పి.ఏల సాయం తీసుకొని స్టేట్‌మెంట్స్ రెడీ చేయండి. ఓ.కె.'' మందహాసంతో అన్నాడు కమల్, ఆమె చేతికి ఫైల్స్ అందిస్తూ.

''వారంలోగా పంపించవచ్చా'' ఫైల్స్ వంక చూస్తూ అడిగింది మృదుల.

ఆశ్చర్యంగా చూశాడతను. ఎప్పుడూ ఏది చెప్పినా ఆ మరుసటిరోజు సాయంత్రంలోగా కంప్లీట్ చేసి పంపడం తప్ప, గడువన్నది ఏనాడూ అంతవరకూ ఆమె అడగకపోవడం వల్ల.

అతని ఆశ్చర్యాన్ని గమనించి ''ఇంట్లో చిన్న ఫంక్షనుంది. మూడ్రోజులు లీవ్ తీసుకుందామని, లీవ్ నుండి వచ్చాక, ఈ ఫైల్స్‌ను చూసి పంపిద్దామని'' అంది సంజాయిషీగా.

''ఓ.కె. యాజ్ యు విష్- మరి ఫంక్షన్‌కి మమ్మల్ని ఇన్వైట్ చేయరా'' నవ్వుతూ అడిగాడు కమల్.

'అమ్మో చేసి ఇంట్లోనూ ఈ అలజడి భరించాలా' అనుకుంటూ పైకిమాత్రం

''వైనాట్? హోటల్ స్వాగత్‌లో ఎల్లుండి ఫంక్షన్- మా అబ్బాయి ఎంగేజ్‌మెంట్-తప్పక రావాలి'' అంది.

''ఏంటీ మీకు పెళ్ళికెదిగిన కొడుకున్నాడా?'' ఆశ్చర్యంగా అడిగాడతను.

సిగ్గుతో ముడుచుకుపోయింది మృదుల. అంతలోగా గంభీరత తెచ్చిపెట్టుకుంటూ ''విశేషమేముంది? నేను ఆల్‌రెడీ అమ్మమ్మని కూడా అయ్యాను'' అంది చిర్నవ్వుతో.

ఆమె వంక ఆరాధనతో చూస్తూ ''మీకు చాలా ఎర్లీ ఏజ్‌లో మారేజ్ అయి ఉంటుంది. ఆమ్ ఐ కర్రెక్ట్'' అతనికామె పర్సనల్ విషయాలు తెలీదు. ఆమె 'మారీడ్' అన్న విషయం తప్పితే విదేశాల్లో ఉండి వచ్చిన మనిషి కాబట్టి, ఎవరి పర్సనల్ మాటర్స్‌లోకి ఎప్పుడూ వెళ్ళలేదతను.

''అవును- ఇరవై రెండేళ్ళకే ఇద్దరు పిల్లల తల్లినయ్యాను'' అందామె చిరుగర్వంతో.

''ఓ ఐ.సీ..మొన్న షాపింగ్‌లో మీ పక్కనున్నది మీ బ్రదర్ గాదా'' చిరునవ్వు తోసుకొచ్చింది మృదుల పెదవుల మీదికి.

''ఊహూ కాదు. మా అబ్బాయే''

''ఓ గాడ్. నిజంగానే! అయితే డ్రైవింగ్ చేస్తూ కనిపించింది...'' అంటూ ఆగాడు తన తలపై

గుండ్రంగా చేతి నాడిస్తూ.

''మావారే-పాపం చాలా ఎర్లీగా వారిది బాల్డ్‌హెడ్ అయింది'' అంది అతని డౌట్ తీరుస్తూ.

''ఓ'' అన్నాడతను కొద్దిగా భుజాలు ఎగరేస్తూ.

''మావారు నాకు మేనత్తకొడుకే. నాకన్నా ఐదేళ్ళు మాత్రమే పెద్ద. మా నానమ్మకి సీరియస్‌గా ఉండటంతో నా పద్దెనిమిదేళ్ళకే పెళ్ళయింది. మా పిల్లలు పుట్టి, వాళ్ళు స్కూల్‌కెళ్ళే ఏజ్‌లో బోర్‌గా ఉండటంతో కరెస్పాండెన్స్ కోర్స్ చేసి గ్రాడ్యుయేట్‌నయ్యాను. ఓ ఐదేళ్ళు జాబ్ చేశాను. అమ్మాయి పెళ్ళయింది. అబ్బాయి ఉద్యోగరీత్యా పూనా వెళ్ళడంతో 'బోర్' మొదలైంది. అది తప్పించుకోవడానికే జాబ్‌లో చేరింది'' అంటూ వెళ్ళిపోయింది తన ఛాంబర్‌కి.

★ ★ ★



తనేదో ఫార్మాలిటీ కోసం పిలిచినా-పెద్ద ఫ్లవర్ బొకేతో అటెండ్ అయిన కమల్‌ని చూస్తూ తబ్బిబ్బయింది మృదుల. తన భర్త రాజారావు దగ్గరకు తీసుకెళ్ళి పరిచయం చేసింది కమల్‌ని.

''మీరు చాలా డైనమిక్ అంటూ మా గోపీ చెప్పేవాడు. ఇప్పుడు మృదులా అదే చెప్పింది. దానధర్మాలూ విరివిగా చేస్తుంటారట కదా'' అన్నాడు రాజారావు నవ్వుతూ.

''ఓ మృదులగారు అవీ చెప్పేశారా? అలా చేయడంలో వింతేముంది? నాకొచ్చింది తినడానికి నావారంటూ నాకెవరూ లేరుగా మరి'' అన్నాడతను.

ఇంతలో ఎవరో పిలవడంతో మృదుల వెళ్ళింది.

బఫే అయినప్పటికీ, అతను తన బాస్ అవడంతో గెస్ట్స్‌కి సర్వ్ చేయడం పద్ధతే కాబట్టి రాజారావ్‌కి కమల్‌కి తనే దగ్గరుండి సర్వ్ చేయసాగింది మృదుల.

''మీరూ మాతో జాయిన్‌కండి'' అన్న కమల్ మాటలతో తనూ ప్లేట్‌లో వడ్డించుకొని వచ్చింది. ఇంతలో రాజారావ్‌నెవరో పిలవడంతో అతనటు వెళ్ళాడు. చెరో చైర్ లాక్కుని అందులో కూర్చుని తినసాగారు కమల్, మృదుల.


ఫంక్షన్ హడావుడి తగ్గి, ఇల్లు చేరేసరికి పదకొండైంది.

''అమ్మా, మీ బాస్ చాలా మాన్లీగా హాండ్సమ్‌గా ఉన్నారు'' అన్నాడు రాహుల్. మృదుల అప్రయత్నంగా రాజారావు వైపు చూసింది.

''ఆ..ఆ అందానికి సరిజోడుగా ఎవరూ కన్పించకనే-ఇంతవరకూ పెళ్ళి చేసుకోలేదని గోపీ ఎన్నోసార్లు చెప్పి బాధపడ్డాడు'' అన్నాడు రాజారావ్ కాస్త తిరస్కారంగా. ఆశ్చర్యంగా చూసింది మృదుల.

అది గమనించినట్లు ''ఏ మనిషైనా నేల విడిచి సాము చేయకూడదు. ప్రపంచంలో అందగత్తెలే లేరా? చూసే కళ్ళకి మనసుంటే చాలు. కలల్లో బతికే వాళ్ళు లైఫ్‌నెలా ఎంజాయ్ చేయగలరు? ఎలా ఫేస్ చేయగలరు? అబ్బో పన్నెండవుతోంది ఇక పడుకోండి'' అంటూ బెడ్‌రూమ్‌వైపు నడిచాడు రాజారావు.

'అతడేదో జనరల్‌గా అన్నాడా? ఇంకేదన్నా దృష్టిలో పెట్టుకుని అన్నాడా?' అని ఆలోచిస్తూ నిద్రలోకి జారుకుంది మృదుల.



## వార్తల్లో నయనతార

ఆమధ్య శింబుతో ముద్దు సీన్‌లో నటించి వార్తలకెక్కి, ఆ తర్వాత అతనితో ప్రేమాయణం గురించి జనాలు చర్చించుకునేలా చేసిన నయనతార- తాజాగా ఆత్మహత్యా ప్రయత్నం చేసిందనే వార్త ఒక్కసారిగా దక్షిణాదిన గుప్పుమంది. రూమర్లని నేనేం పట్టించుకోను అని డేరింగ్‌గా చెప్పే నయనతార ఈ విషయంలో వెంటనే స్పందించింది. ఆమె సెక్రటరీ ద్వారా దీనికి ఖండన ఇప్పించింది. ఈ వార్త వ్యాపించడానికి కారణం కేరళకు చెందిన ఓ ఆసామీట. అతనితో ఆమెకి వచ్చిన వివాదం ఇలా ఆమె ఆత్మహత్యా యత్నం చేసిందనే పుకారు పుట్టడానికి కారణమైందట. మొత్తానికి ఇదో పబ్లిసిటీ!

★ ★ ★

''మృదులగారూ! ఎల్లుండి బెంగుళూర్‌లో సెమినార్ ఉంది. నాకు వంట్లో బాగోవటం లేదు. మీరు అటెండవ్వగలరా? వీలైతే నేనప్పటికి జాయినవుతాను'' అడిగాడు కమల్- అంతకుముందొకసారి ఆమె వెళ్ళిందన్న సంగతి తెలిసి.

'అమ్మో-బెంగుళూర్‌లో ఇతన్తో - ఒంటరిగానా' అనుకొంది మృదుల. ఇదివరకు అప్పుడా భావం కల్గలేదు. బహుశా గోపీగారికీ, తనకీ ఉన్న వయోభేదం వల్లనో లేక అతనిపై ఎలాంటి ఆకర్షణ లేకపోవడం వల్లనా అన్నది ఇదమిద్ధంగా తెలుసుకోలేకపోతూ.

''ఏంటి? ఏమీ మాట్లాడరూ?'' రెట్టించాడతను.

''ఊహూ వెళ్ళలేను. నాకూ ఒంట్లో బావుండటం లేదు'' అప్రయత్నంగా అబద్ధమాడేస్తూ అంది మృదుల.

''అరె-అలాగా! ఏమైంది డాక్టర్ దగ్గరికి వెళ్ళారా? ఐనా మీరు ఫంక్షన్ హడావిడిలో చాలా స్ట్రెయిన్ అయ్యారు. చాలా వడిలిపోయింది ముఖం. అయినా చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్లున్నారనుకోండి'' అన్నాడు కమల్.

గుండె గబగబా కొట్టుకుంది మృదులకి. అతనికెవరూ నచ్చకనే బ్రహ్మచారిగా మిగిలిపోయాడని విన్నది తను. మరి ఇతనేంటి? ఏదో ఒక సందర్భంగా తనని ఎక్కువగానే పొగుడుతూ ఉంటాడు. అంటే తను ఇతనికి నచ్చిన అందగత్తెనా? అలా అనుకోగానే గర్వం కల్గింది. ఆ తర్వాత ఏదో భయమూ కల్గింది. ఇదెక్కడికి దారి తీస్తుందోనని.

అబద్ధాన్ని నిజం చేసుకోవాలన్నట్లు పర్మిషన్ తీసుకొని ఇంటికెళ్ళిపోయిందామె.

ఆ మర్నాడు అనుకోకుండా అతిథులు రావటంతో ఆఫీస్‌కి 'రాను' అంటూ మెసేజ్ ఇచ్చింది.

ఆరోజు సాయంత్రం పనిమనిషి రాకపోవడంతో వాషింగ్‌మెషిన్‌లో బట్టలు వేసి అవి ఆరెయ్యడానికి ఇంటి ముందున్న వరండాలోకి వచ్చింది మృదుల.

ఇంతలో ఇంటిముందు కారు ఆగటంతో యధాలాపంగా చూసిందటువైపు. కారు దిగివస్తోన్న కమల్‌ని నిర్ఘాంతపోతూ చూసింది.

ఎప్పుడూ మడత నలగని చీరలో, చక్కగా పిన్ చేసి హుందాగా ఉండే మృదుల, కొంచెం అస్తవ్యస్థంగా తడిసినబట్టలతో కన్పించేసరికి, కమల్ చూపులు నిలబడిపోయాయ్. లేత అరిటాకులాంటి ఆమె పొట్టపై మెరుస్తున్న నీటి బిందువులు -చిందరవందరగా నుదుటిపై పడ్డ ముంగురులు, ఆమెకో వింత అందాన్ని ఆపాదిస్తూంటే మైమరిచి చూస్తూండిపోయాడు. అతనినా సమయంలో ఏమాత్రం ఎక్స్‌పెక్ట్ చేయని మృదుల అతనినలా చూస్తూ తత్తరపడింది. ఆ తత్తరపాటు చూశాక, కమల్ కాస్త గిల్టీగా ఫీలవుతూ ''సారీ! మీకు ఒంట్లో ఎలా ఉందోనని-ఇదే దారిన వెడుతున్నాను కాబట్టి- చూసి వెడదామని..'' అంటూ అతడు ఆగాడు.

ఆమె తెలివి తెచ్చుకొని ''ఆ..రండి లోపలికి-కూర్చోండి'' అంటూ సోఫా చూపించి, అతడి చూపులింకా వంటిని తడుముతున్నట్లే అన్పించి, గబగబా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి చీర మార్చుకొని వచ్చింది. దూమెరుగ్గా, జుట్టును సవరించుకుంటూ, కేవలం ఐదు నిముషాల్లో తయారై 'టీ' తీసుకొని వచ్చిన ఆమెను ముచ్చటగా చూస్తూ ''మీరు ఇంట్లోనూ ఫాస్టే'' అంటూ టీ సిప్ చేసి ''టీ కూడా మీలాగే చాలా చాలా బావుంది. సారీ నేనెంత ఆపుకొందామన్నా, సభ్యత కాదనుకొన్నా మీ అందం, నాతో ఇలా పలికిస్తోంది'' అన్నాడు తన తప్పేం లేదన్నట్లు.

ఏమ్మాట్లాడాడో అర్థం కాలేదు మృదులకు.

ఇంతలో ఆఫీస్ నుండి రాజారావ్ వచ్చాడు. కమల్‌నక్కడ అలా చూడటం అతనికి ఆశ్చర్యం కల్గించినట్లు అతని ముఖకవళికలు చెబ్తూనే ఉన్నాయ్.

''ఏదో అర్జెంట్ విషయమట-మాట్లాడ్డానికి వచ్చారు'' తడబడుతూ అనేసింది మృదుల. దాంతో తన రాక ఆమెకెంత ఇబ్బందిని కల్గించిందో అర్థమైన కమల్, మరో నిముషం పాటు కూర్చొని వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి నిద్రపోయేముందు మళ్ళీ అతని

చూపులు గుర్తొచ్చి అసహనంగా ఫీలైంది. భర్తతో అబద్ధం చెప్పినందుకు గిల్టీగా ఫీలయింది. అతడు పరామర్శించడానికి వచ్చాడని ఎందుకు చెప్పలేకపోయింది. ఆలోచనలో పడింది. ఈ ఆకర్షణ అతడ్ని చూస్తున్నంతకాలం ఉండనే ఉంటుంది. దాన్నే అవాయిడ్ చేస్తే ఆ ఆలోచన కలిగాక ఇక ప్రశాంతంగా నిద్రపోయింది. ఆ వారంలో తను చేయాల్సిన పనులన్నీ చకచకా ముగించుకొంది.

''రాజా! నేను జాబ్ మానేస్తాను-ఎలాగూ రాహుల్ పెళ్ళి కూడా దగ్గరపడుతోంది గదా'' అంది ఎటో చూస్తూ.

''ఏం- లీవ్ పెట్టొచ్చుగా. మానడం ఎందుకు?'' అడిగాడు రాజారావ్.

''ఏమో-జాబ్ చేయాలన్పించటం లేదీ మధ్య''

''ఆ కమల్‌తో ఏదన్నా ప్రాబ్లమా? లేక కంపెనీ వర్కర్స్‌తోనా?''

చురుగ్గా చూస్తూ అడిగాడు రాజారావ్.

గతుక్కుమంది మృదుల. ''అహ ఎవరితోటీ ఏ ప్రాబ్లమ్ లేదు'' అంది ముక్తసరిగా.

''మరైతే ఎందుకు మానడం? ఇన్నాళ్ళూ ఈ జాబ్ చేయడం వల్ల రిలీఫ్‌గా ఫీల్ అవుతున్నానని ఇన్నాళ్ళకి జీవితం సార్థకం చెందిందనీ, ఆర్థికంగా వెసులుబాటుగా ఉంటోందనీ- ముఖ్యంగా ఏ ఆలోచనలకూ తావిచ్చే సమయం లేనందుకే హెల్త్ బావుంటుందని-చాలా చాలా అన్నావ్'' ఆశ్చర్యంగా ఆమెని చూస్తూ అన్నాడు.

నిజమే- అప్పుడన్నీ అన్పించాయ్. మరెందుకిప్పుడిలా? ఆలోచనలో పడింది మృదుల.

''ఏమన్నా ప్రాబ్లెమా-నాతో చెప్పొచ్చుగా?'' అనునయంగా అడిగాడు.

ఆ గొంతులోని మార్దవానికి కరిగిపోతూ ''ఏంటోనండి. కమల్‌గారు అస్తమానం నా అందాన్ని పొగుడుతూంటే ఎలాగో ఉంది. అలా అని పొరపాట్న కూడా అసభ్యంగా ప్రవర్తించలేదింతవరకూ. కానీ ఎందుకో మనసంతా గజిబిజిగా డిస్టర్బ్‌డ్‌గా ఉంటోంది. ఎందుకో అతనితో కటువుగా ఉండలేకపోతున్నాను. కానీ అతని సమక్షంలో చాలా అనీజీగా ఫీలౌతున్నా'' అంది మృదుల తలొంచుకొని.

రాజారావ్ నుండి ఏ రెస్పాన్స్ లేదు. ఏంటాని తలెత్తి చూసిన మృదులకు తననే పరీక్షగా పట్టి పట్టి చూస్తున్న రాజారావ్ కన్పించాడు. ఆ చూపులో కోపం-అనుమానం-అసహనం.

''అందుకేనా ఈమధ్య తరచూ ఏదో వంకని లీవులు పెడుతున్నావ్? నువ్వు లీవ్‌లు పెడుతూంటే నిన్ను చూడకుండా ఉండలేని అతను మనింటికి రాకపోకలు సాగిస్తున్నాడన్నమాట''.

అతని మాటలకు నిర్ఘాంతపోయింది. ''రాకపోకలన్నమాట ఏంటి? అతనొక్కసారేగా వచ్చింది'' అంది అయోమయంగా.

''ఇంతకూ నీ అభిప్రాయం ఏంటి అతని మీద? అతన్నుండి తప్పించుకోవాలనుకుంటున్నావంటే, సంథింగ్ ఇంట్రెస్ట్ నీకూ ఉన్నట్లేగా'' ముఖం కందగడ్డలా పెట్టుకొని అన్నాడు రాజారావ్.

''నామీద అనవసరంగా అభాండాలేస్తున్నారు. ముందు ముందు ఏ ఇబ్బందులూ రావొద్దనే జాబ్ మానాలనుకుంటున్నది. మిమ్మల్ని సంప్రదించకుండా మానడం ఎందుకని అడిగాను. నాకింట్రెస్ట్ లేదని మానేస్తే సరిపోయేది'' అంది మృదుల కాస్త కోపంగా.

ఏమీ మాట్లాడలేదు రాజారావ్. ఇద్దరి మధ్యా మౌనం రాజ్యమేలసాగింది.

వారం గడిచినా అతను మృదులతో మాటలు కలిపే ప్రయత్నం చేయలేదు. అదోరకం స్తబ్దత. ఎప్పుడూ ఏవేవో చెబుతూ వంటింట్లో కెళ్ళినా వెనుకెనుకే తిరిగే రాజారావ్- ఇంట్లో గడపటమే మానేసాడు. ''పిల్లలు చూడకుండా పెట్టుకొనే ముద్దుల్లో వింత రుచి ఉందోయ్'' అంటూ అకస్మాత్తుగా తనని ముద్దులాడే రాజారావ్, తననో శత్రువులా చూస్తూ తప్పించుకు తిరుగుతూ ఉంటే రంపపు కోతలా ఉంటోంది మృదులకి.

కావాలని రాత్రుళ్ళు తనకై తనే మీద చేయి వేసినా, ఆ చేతిని తప్పించి గోడవైపు తిరిగి అతడు పడుకొంటుంటే ఆమె మనసెంతో గాయపడ్తోంది.

''ఎందుకింత పరాయిగా ప్రవర్తిస్తున్నారు'' అడిగింది గద్గద స్వరంతో.

''ఎలా ప్రవర్తిస్తున్నాను'' విసుగ్గా అడిగాడు.

''ఇలా చిరాగ్గా విసుగ్గా ఎప్పుడన్నా మాట్లాడారా? నా వల్ల పొరపాట్లు జరిగినప్పుడు కూడా తేలిగ్గా తీసుకున్నారు. ఇప్పుడేం జరిగిందని ఈ మౌనం-విసుగు? ఎందుకు నన్నిలా వెలి వేసినట్లు చూడటం? నేనేం తప్పు చేసానని?'' బాధగా అడిగింది మృదుల.

''నువ్వో పరపురుషుడి ఆకర్షణలో పడ్డావని తెలిసి ఎంత నరకంగా ఉందో తెలుసా?''

''మనసు కోతిలాంటిది. అది చేసే కోతిచేష్టలకి విలువ నీయటం లేదే. అతన్నే ప్రేమించేదాన్నయితే జాబెందుకు మానాలనుకొంటాను?'' ఆవేశంగా అడిగింది.

''అతన్ని చూస్తూ నిగ్రహంగా ఉండలేననేగా? అంతటి బలహీనతనా? నీ మనసునిండా అతడే నిండి ఉన్నాడని తెలిసి నిన్నెలా ముట్టుకోగలను?''

''లేనిపోని అనుమానాలతో భార్యకి సుఖం లేకుండా చేయటం ఒక నేరం. ఆ నేరాన్ని చేస్తూ సమర్థించుకుంటున్నారు. తప్పులు జరగకుండా జాగ్రత్తపడటాన్ని ఎందుకు వక్రకోణం నుండి చూస్తున్నారు? పెళ్ళికి ముందే ఓ అమ్మాయితో ఎఫైర్ ఉందని నాతో మన మొదటిరాత్రి చెప్పి- 'ఇక మీదట అలాంటి తప్పులు జరగవు' అని అన్నారు. అది నేను నమ్మాను. పెద్ద మనసు చేసుకుని క్షమించి, సమాధానపడ్డాను. కానీ మీరు- ఏ తప్పూ జరగని దానికి నన్ను శిక్షిస్తున్నారు? ఎందుకీ తేడా? మీది మగజాతి కావడం వల్లనేగా'' ఆవేశంతో వణికిపోతూ అంది మృదుల.

ఛెళ్ళున చెంపమీద కొట్టినట్లయింది రాజారావ్‌కి.

'నిజమే-భార్యాభర్తలన్నాక ఏ రహస్యాలూ ఉండకూడదనే తను చెప్పాడు. ఐనా ఆమె తనని క్షమించి, ఇష్టంగా తనని తాను సమర్పించుకొంది. తను కేవలం జీతమామె చేతికిచ్చేసి చేతులు దులుపుకున్నా, ప్రతీ విధిని సక్రమంగా మృదుల నిర్వర్తించింది. పెళ్ళైన ఇన్నేళ్ళలో వేలెత్తి చూపే విధంగా ప్రవర్తించలేదు. కోతిలాంటి మనసు చేసిన ఓ విన్యాసాన్ని, తనని నమ్మి చెప్పినందుకు తనిలా ప్రవర్తించడం ఏమంత సబబుగా ఉంది? అసలు ఆమె ఈ మాట తన మనసులోనే ఉంచుకొంటే తనకి తెలిసేదా? మృదులను అనుమానించడం తనను తాను అనుమానించుకోవడమే. తామిద్దరూ ఫ్రాంక్‌గా ఉండాలనే నిర్ణయించుకొని చెప్పుకొన్నారు. కానీ రిసీవ్ చేసుకోవడంలోనే తను 'తేడా' చూపించాడు. మగాడినన్న అహంతోనే మృదుల మనసుని కష్టపెట్టాడు. ఛ-ఇంత అవివేకంగా తను ప్రవర్తించాల్సింది కాదు. తన తలపై ఏ దెయ్యం నాట్యం చేసిందో- ఇంత మూర్ఖంగా ప్రవర్తించాను' అనుకొంటూ, ఇప్పుడు క్షమించమని అడిగితే మృదుల క్షమిస్తుందా? అనుకొంటూ పశ్చాత్తాపంతో మృదుల వంక చూశాడు రాజారావ్.

